# అమ్మకడుపు చల్లగా - 2

## - గొల్లపూడి మారుతీరావు



స్వర్గీయ గొల్లపూడి మారుతిరావుగారి ఆత్మకథ 'అమ్మకడుపు చల్లగా' ఇప్పటికి 11 సంవత్సరాలుగా మార్కెట్‌లో ఉన్న సంగతి పాఠకులకు విదితమే. అందులో మారుతిరావుగారు 2007 వరకూ తన జీవితంలో జరిగిన సంఘటనలను అత్యంత ఆసక్తికరంగా పాఠకులకు అందించారు. దానికి కొనసాగింపుగా 2007 నుంచి తన జీవితంలోని ముఖ్యమైన సంఘటనలను, క్రిందటి సంవత్సరమే, వ్రాయడం ప్రారంభించారు. అనారోగ్యకారణాలవల్ల దాన్ని పూర్తిచేయలేకపోయారు. ఆయన వ్రాసిన కొద్దిపేజీలను వ్రాసిన వెంటనే, 2018 నవంబర్‌లో, కౌముదికి పంపించారు. పూర్తిచేసి ఉంటే ఆ పుస్తకానికి ఏమి పేరు పెట్టి ఉండేవారో! ఆ అసంపూర్తి రచనను అమ్మకడుపు చల్లగా - 2 గా కౌముది పాఠకులకు ధారావాహికంగా అందిస్తున్నాం.

*(గత సంచిక తరువాయి)*

**ఈ దశలో** "అమ్మ కడుపు చల్లగా" మొదటి సంపుటాన్ని గురించి రెండు మాటలు చెప్పాలి. మల్లాది సచ్చిదానందమూర్తిగారు సాహిత్యాభిమాని. ప్రత్యేకంగా నాకు. నేను రచన చేయడం ప్రారంభించినప్పటినుంచీ ప్రచురించే అవకాశాన్ని ఆయన అంది పుచ్చుకున్నారు. అంతేకాదు. పుస్తకం ఎక్కువభాగం కొడైకెనాల్‌లో వారి గెస్టు హౌస్‌లో కూర్చుని రాశాను. వారం రోజులయాక రచన ముమ్మరంగా సాగుతుండగా మూర్తిగారికి ఫోన్ చేసి మరో వారం రోజులుంటానన్నాను. ఆయన ఆనందంగా అంగీకరించారు. ఆత్మకథ పూర్తయి ప్రచురితమయాక స్వయంగా తిరుపతి తీసుకువెళ్ళి స్వామివారి పాదాల దగ్గర ఉంచి వచ్చారు. ఈ గ్రంథం శీర్షిక నిర్ణయం దగ్గర్నుంచీ, ప్రూఫ్ రీడింగు వరకూ భరాగోగారు ప్రమేయం ఉంది.

ప్రచురణ పూర్తయాక భరాగో అన్నారు ఒకసారి: "నీ ఆత్మకథ హిట్ అయ్యా" అని.

నాకు నవ్వొచ్చింది. హిట్టో ఫట్టో ఆశించి నేను రాయలేదు. ఆత్మకథ పెరఫార్మెన్స్ కాదు. అలనాటి ప్రధాని ప్రత్యేక కార్యదర్శి హెచ్.వై.శారదా ప్రసాద్ ఒకమాట అన్నారు: A well written life is as rare as a well lived one అని. వెనక్కి చూసుకున్నప్పుడు వివిధ రంగాలలో వివిధ ప్రముఖులతో సాంగత్యం, తెలుసుకున్న విషయాలు ఉత్సాహపరచగా ఆత్మకథ రాయాలనే తలంపు చాలాకాలంగా ఉండేది. అదిలా కార్య రూపం దాల్చింది.

ఈ ఆత్మకథ నాలుగు ముద్రణలకు నోచుకుంది. పుస్తకాలు అయిపోయక ఎందరో ఫోన్లు కద్దు. ఓ రాత్రి మల్లాదిగారు ఫోన్ చేసి: మీ ఆత్మకథను ప్రచురించడం నా అదృష్టం. మన మధ్య స్ట్రాంగ్ వైబ్రేష్న ఉన్నాయి. రచనలో మీరు పరిపక్వమయిన దశకి వచ్చారు అన్నారు.

ఆత్మకథ చదివి మిత్రులు పి.బి.శ్రీనివాస్ "You are a treasury of talent" అన్నారు.

చాలామంది ప్రముఖుల స్పందన విన్నాక కనీసం కొందరి స్పందనయినా ఒక చిన్న పుస్తకంగా ముద్రించి పెద్ద పుస్తకంతోపాటు ఉచితంగా ఇవ్వాలని ప్రచురణ కర్త సూరిబాబు, మల్లాది నిర్ణయించారు. తత్ఫలితంగా సద్గురు శివానందమూర్తిగారు, మంగళంపల్లి బాలమురళీకృష్ణగారు, ముళ్ళపూడి వెంకటరమణగారు, డాక్టర్ అనంత పద్మనాభరావుగారు, కిరణ్‌ప్రభ - యిలా కొందరి స్పందనలతో పుస్తకమయింది. ఇందులో చిన్న తమాషా. ఈ పుస్తకంలో మొదటి స్పందన కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారిది. ఇదేమిటి? ఆయన దివంగతులు కదా? మాలో ఒక మిత్రుడు అత్యద్భుతంగా వారి శైలిని అనుకరిస్తూ రాశారు. ఆయనెవరో కనుక్కుంటే సముచితమైన బహుమతి యిస్తాం - అన్నారు భరాగో. మొదట పద్యంతో వ్యాసం మొదలయింది.

మారుతియన్న నామమది మానసమందు ననేక భావనల్
గారవమొప్ప యేర్పరచు కావ్య మహాద్భుత వీచికాఝురీ
వారణ నిర్విరామ గుణవాగ్విభవైక విలోక డోలికా
ధారణ మొప్ప ఆతనిని ధన్యుడ వంచని మెచ్చరే యటన్

వ్యాసం ఇంకా అల్లరి చేసేశాడు డాక్టర్ పప్పు వేణుగోపాలరావు. తీరా ఎవరూ ఆయన్ని కనిపెట్టలేకపోయారు.

ఆత్మకథ మీద వచ్చిన స్పందనలలో తలమానికంగా చెప్పుకోదగినది చాలాకాలం తరువాత వచ్చిన ప్రొఫెసర్ తంగిరాల సుబ్బారావుగారి ఆరుపేజీల ఉత్తరం. ఎన్నో సూచనలు చేస్తూనే "ఇటువంటి అత్యాధునిక గ్రంథం నేను చదవలేదు. దీని గొప్పతనాన్ని చెప్పడానికి నాకు మాటలు రావడంలేదు. ముళ్ళపూడి వెంకటరమణగారు తన ఆత్మకథని (కోతికొమ్మచ్చి") హాస్యరసభరితంగా చెబితే, మీరు నవరసభరితంగా చెప్పారు. ప్రాచీన సాహిత్యంలో చాలా గొప్ప గొప్ప గ్రంథాలు నన్ను తన్మయీభూతుణ్ణి చేసినవి చాలా ఉన్నాయి. ఆధునిక కవులలో శ్రీశ్రీ తిలక్, శేషేంద్ర కవిత్వాలు నాకు చాలా యిష్టం. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి "అనుభవాలూ - జ్ఞాపకాలూను" చాలా బాగుంది. కానీ మీ గ్రంథం ఇచ్చినంత పరిపూర్ణమైన ఆనందాన్ని ఆ గ్రంథం ఇవ్వలేదు."

ఇలా సాగింది. తెలుగు సాహిత్యానికే మకుటాయమాన మనదగ్గ రచన శ్రీపాదవారి "అనుభవాలూ - జ్ఞాపకాలూను". అలాగే ముళ్ళపూడి "కోతికొమ్మచ్చి" వారి ధోరణిలో ఆత్మకథకి కొత్త ఒరవడి. ఏమయినా అంతటి పండితుడిని నా రచన అలరించడం నా అదృష్టం.

ఇలా ఎన్నో స్పందనలు. మూడు పునర్ముద్రణలు పూర్తిచేసుకుని నాలుగో ముద్రణ ఇటీవలే జరిగింది. నాలుగు ముద్రణలూ మల్లాదివారి ఆధ్వర్యంలోనే జరిగాయి.

మిత్రుడు, పాత్రికేయుడు పి.నాగేంద్రకుమార్ చదివి ఒకే ఒక కార్డు అర్జంటుగా పోస్టు చేసాడు. "ఇది పుస్తకం కాదు - పూనకం" అని.

మాలతీచందూర్ ఫోన్ చేశారు: "చేతికందగానే పుస్తకం తిప్పాను. మనం ఉండకపోయినా పుస్తకం మరో 200 ఏళ్ళు ఉంటుంది. ఇది తెలుగువారి చరిత్ర. ఇంత చక్కగా వేసిన ఆత్మకథని నేను చూడలేదు" అంతేకాదు స్వాతి మాసపత్రికలో ఆరు పేజీల సమగ్ర సమీక్షని రాశారు.

మిత్రుడు, సినీ నిర్మాత మురారి ఫోన్ చేశాడు - పుస్తకం చదవడాన్ని మధ్యలో ఆపి" "మీ పుస్తకాన్ని బతికించినవాడు మీ వాసూ. ఇప్పుడు మాట్లాడగలిగే స్థితిలో లేను" అని ఫోన్ పెట్టేశాడు. అసలు పుస్తకం చేతికి రాగానే ప్రచురణ కర్త సూరిబాబు ఆవురావురుమని చదివేసి ఫోన్ చేశాడు: "ఇదొక కళాఖండం. ఆశ్చర్యం, కన్నీళ్ళు, ఉత్సుకత - అన్నీ తోసుకు వస్తున్నాయి. ఎంతోమంది మహానుభావులతో సాంగత్యం. పరిచయాలు. ఇది పాఠ్యపుస్తకం కావాలి" అన్నాడు ఆవేశంగా.

జీవా పార్కులో నాతో రోజూ నడిచే మిత్రులు, బాబా భక్తులు రంగారావుగారు అన్నారు: “Whether you love God or not, God loves you. మనిషి ఇంతకన్నా సార్థకంగా జీవించలేడనిపించింది" ఇప్పుడాయన కీర్తిశేషులు.

ఆత్మకథ చదివాక యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌గారు విశాఖపట్నం కళాభారతిలో లోక్ నాయక్ ఫౌండేషన్ సభకి నాతోపాటు వస్తున్న మా ఆవిడకి సరాసరి వచ్చి పాదాభివందనం చేశారు. అంతేకాదు. ఆనాటి సభలో గర్వంగా చెప్పుకున్నారు.

ఇలాగే మరొక వ్యక్తి అవసరాల రామకృష్ణారావుగారు. మద్రాసు నుంచి వస్తూనే ఒకసారి ఆయనకి ఫోన్ చేశాను. "మీ ఆత్మకథ చదివిన మొదటి ప్రేక్షకుడు కావడం నా అదృష్టం" అంటూనే "మీ ఆవిడ వచ్చారా?" అన్నారు.

వచ్చారన్నాను.

"మీ ఆత్మకథ చదివాక మీ ఆవిడ మీద గౌరవం పెరిగింది. ఇంటికి వస్తాను" అన్నారు.

ఆత్మకథ గురించి నాకు వచ్చిన ఒక ఫోన్ ముఖ్యమైనది. పెద్దలు, రేడియోలో చేరిన తొలిరోజుల్నుంచీ, ఆయన స్టేషన్ డైరెక్టరయి విజయవాడ వచ్చిన వరకూ కలిసి పనిచేసిన బాలాంత్రపు రజనీకాంతరావుగారు (ఆయనకప్పుడు తేలిగ్గా 95 ఉంటాయి.) "మీ ఆత్మకథ చదవాలని ఉంది. ఒక కాపీ పంపగలరా?" అనడిగారు.

క్రియేటివ్ లింక్స్ సూరిబాబుకి ఫోన్ చేశాను. ఆయన భరాగో పర్సనల్ కాపీ తీసుకుని వెంటనే పంపించాడు. సరిగ్గా వారం రోజులకి రజనీకాంతరావుగారి దగ్గర్నుంచి మళ్ళీ ఫోన్: "మీ ఆత్మకథ చదివాను. చాలా బాగుంది. ఇది భరాగోకి మీరు ఆత్మీయంగా ఇచ్చిన పుస్తకం. నాకో కాపీ పంపగలరా?".

"మొదటి ముద్రణ అయిపోయింది. మీరా కాపీని ఉంచేసుకోండి" అన్నాను.

ఈ గ్రంథాన్ని ప్రశంసాపత్రం చేయడం ఉద్దేశం కాదు. ఇవి కేవలం నమూనా స్పందనలు.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments